ప్రజాశక్తి

మంగళవారం 22 జూలై 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



విశాఖలో పెద్దపెట్టున నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయండి

◆ యాప్‌ల భారం మాకొద్దు

◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అంగన్‌వాడీల ధర్నాలు

ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని, యాప్‌ల భారం నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. వినతిపత్రాలు అందజేశారు.

(వార్తలు 8లో..)



అనకాపల్లిలో ధర్నా చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు

6న జివిఎంసి స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నిక ఆగస్టు 6న జరుగనుందని కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం ఉన్న పది మంది స్థాయీ సంఘం కాల పరిమితి త్వరలో ముగియనుందని పేర్కొన్నారు. ఈ మేరకు నూతనంగా పది మంది స్థాయీ సంఘ సభ్యులను ఎన్నుకునేందుకు సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. దీన్ని జివిఎంసి ప్రధాన కార్యాలయంలోనూ, అన్ని జోనల్ కార్యాలయాల్లోనూ నోటీస్ బోర్డుల్లో అతికిస్తామన్నారు. ఓటర్ల జాబితా అక్కడే ఉంటుందని తెలిపారు. నామినేషన్ పత్రాలను జివిఎంసి ప్రధాన కార్యాలయంలోగల కార్యదర్శి విభాగం మిగతా 2లో..

ఎయులో బిటెక్ క్వాంటం కంప్యూటింగ్ కోర్సు

◆ ఇ ఎపి సెట్ ద్వారా అడ్మిషన్లు

◆ తొలి సంవత్సరం 30 మందికి ప్రవేశాలు

◆ ఆమోదం తెలిపిన వర్సిటీ అకడమిక్ సెనేట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఆంధ్ర విశ్వవిద్యా లయంలో బి టెక్ క్వాంటం కంప్యూటింగ్ కోర్సుకు సెనేట్ ఆమోదం తెలిపింది. సోమవారం నిర్వహించిన అకడమిక్ సెనేట్ సమావేశంలో సభ్యులు ఈ నూతన కోర్సు ప్రారంభించడానికి ఆమోదాన్ని అందించారు. ఈ కోర్సులో ప్రవేశాలను ఇ ఎపి సెట్ ద్వారా నిర్వహిస్తారు. ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇసిఇ) విభాగం నుంచి నిర్వహించే ఈ కోర్సులో తొలి బ్యాచ్‌లో 30 మందికి ప్రవేశం కల్పిస్తారు. ఈ కోర్సుకు సంబంధించిన సబ్జెక్టులను కంప్యూటర్



సెనేట్‌లో మాట్లాడుతున్న విసి రాజశేఖర్

సైన్స్, ఇంజినీరింగ్ ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, ఇన్స్ట్రుమెంటేషన్, ఇసిఇ తదితర విభాగాల ఆచార్యులు, నిపుణులు బోధించనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సులో ప్రవేశాలు నిర్వహించనున్నారు.

సెనేట్‌లో తీసుకున్న మరికొన్ని నిర్ణయాలు

మెటీరియాలజీ ఓషనోగ్రఫీ విభాగం నుంచి గతంలో నిర్వహించి నిలిపివేసిన ఎంటెక్ మిగతా 2లో..

వివాదంలో 'అయోధ్య' నమూనా సెట్

◆ సీతారాముల కల్యాణం పేరిట వసూళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అట్టహాసంగా బీచ్ రోడ్డులోని పామ్ బీచ్ హోటల్ పక్కన ఏర్పాటు చేసిన శ్రీ గరుడ అయోధ్య రామ మందిరం నమూనా సెట్ వివాదంలో చిక్కుకుంది. ఈ నెల 29న భద్రాచలం ఆలయం ఆస్థాన పండితుల సారథ్యంలో శ్రీ సీతారాముల కల్యాణం చేస్తున్నట్టు నిర్వాహకులు ఇంటర్నెట్ ప్రచార మాధ్యమాల ద్వారా చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని భద్రాచలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రమాదేవి విశాఖలోని త్రీ టౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. అందులో ప్రధానంగా దేవస్థానం వారి అనుమతి లేకుండా, మిగతా 2లో..

రహదారిని తెరిపించాలి

▶ వార్త 3లో..

దళితుల చైతన్యంతో చట్టాల అమలు

▶ వార్త 4లో..

ప్రయివేటు ఆసుపత్రుల్లో ధరల పట్టిక ఉండాలి

▶ వార్త 4లో..

కార్టూనిస్టు ఎంవి.రమణారెడ్డి కన్నుమూత

ఆంధ్ర మెడికల్ కళాశాలకు పార్థివ దేహం అప్పగింత



రమణారెడ్డి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, పెందుర్తి : ప్రముఖ కార్టూనిస్టు, గ్రంథాలయ ఉద్యమ కారుడు, పుస్తక ప్రియుడు, చదువరి ఎంవి.రమణారెడ్డి (88) సోమవారం తెల్లవారుజామున సుజాతనగర్‌లోని తన గృహంలో కన్నుమూశారు. ఆయన అసలు పేరు ముల్లంగి వెంకట రమణారెడ్డి. తను కార్టూనిస్టుగా ఉన్నప్పటికీ తెలుగు కార్టూన్ రంగానికి పునాదులు వేసిన తలిశెట్టి రామారావు కార్టూన్లను భావితరాలకు అందించాలని రమణారెడ్డి ఆశించారు. అనుకున్నదే తడవుగా తలిశెట్టి రామారావు కార్టూన్లు తెలుగువారిలో ఎవరి వద్ద ఉన్నాయి ? అనేది తెలుసుకునే ప్రయత్నం చేసి, వాటిని సేకరించే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా ఒడిశా రాష్ట్రం బరంపురంలో ఉన్న రామారావు గృహానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను కలిసి కొన్ని కార్టూన్లు సేకరించారు. సుమారు 100 వరకు కార్టూన్లను ఒకచోటకు చేర్చి 'తలిశెట్టి రామారావు కార్టూన్లు' పుస్తకాన్ని అద్భుతంగా ముద్రించి అందించారు. ఈ పుస్తకాన్ని 2011లో విజయవాడ సాహితీ మిత్రులు, తెలుగు కార్టూనిస్టుల సమక్షంలో ఆవిష్కరించారు. అదే సందర్భంగా ప్రతి ఏటా మే 20న తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం పాటించాలని రమణారెడ్డి ప్రతిపాదించి ఆ మేరకు తీర్మానం చేయించారు. అప్పటినుంచి తెలుగు రాష్ట్రాలలో ఆ రోజున తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం పాటిస్తున్నారు. ప్రముఖుల కార్టూన్లపై సహేతికమైన విమర్శలు రాయడంలో రమణారెడ్డి మంచి గుర్తింపు పొందారు. తెలుగు సాహితీ రంగానికి, కార్టూనిస్టుల రంగానికి రమణారెడ్డి మరణం పెద్ద లోటు అని విశాఖ రచయితలు అర్నాథ్, పెబ్బులి హైమావతి, మేడా మస్తాన్ రెడ్డి, అడపా రామకృష్ణ, కార్టూనిస్టులు హరి వెంకట్, టిఆర్ బాలు, లాల్, రామశర్మ మిగతా 2లో..

స్పీకర్‌గారూ.. మీకు తగునా..

- సచివాలయ ఉద్యోగి ఆవేదన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అసెంబ్లీ స్పీకర్, నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు తన బదిలీ విషయంలో అవరోధం సృష్టించడంపై సచివాలయ ఉద్యోగి రెడ్డి సాధన విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన తనకు 2019 నవంబర్ 16న అప్పటి ప్రభుత్వంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ (విఎఎ) ఉద్యోగం లభించిందని తెలిపారు. నాడు పాయకరావుపేట సచివాలయంలో చేరి ఈ నెల 15 వరకు పని చేశానని చెప్పారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గత నెల 28న విశాఖ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఉద్యోగుల బదిలీలు నిర్వహించగా ర్యాంకు ప్రకారం నాతవరం మండలం ఎంబి.పట్నం సచివాలయంకు తనను ఎంపిక చేశారని, ఆ మేరకు తనకు బదిలీ ఉత్తర్వులు రావడంతో ఈ నెల 15న తనను పాయకరావుపేట ఎంపిడిఒ ఉద్యోగ విధుల నుంచి రిలీవ్ చేశారని చెప్పారు. మరుసటి రోజైన 16న తాను నాతవరం ఎంపిడిఒను కలిసి మిగతా 2లో..

గొప్ప పోరాట యోధుడు అచ్యుతానందన్

కేరళ మాజీ సిఎంకు ఘన నివాళి



విశాఖలో నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పూర్వ పొలిట్ బ్యూరో సభ్యులు విఎస్.అచ్యుతానందన్ గొప్ప పోరాట యోధుడని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం అనారోగ్యంతో తిరువనంతపురం ఆసుపత్రిలో అచ్యుతానందన్ మృతిచెందడం పట్ల సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావులు సంతాపం తెలిపారు.

ఈ సందర్భంగా జగదాంబ వద్దగల నండూరి ప్రసాదరావు భవనంలో అచ్యుతానందన్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు జివిఎన్.చలపతి, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ నాయకునిగా అనేక పోరాటాల్లో అచ్యుతానందన్ కీలకపాత్ర పోషించారన్నారు. 17 సంవత్సరాలకే కమ్యూనిస్టు పార్టీలో సభ్యునిగా చేరి కృష్ణ పిళ్లై నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. కార్మికులు, వ్యవసాయ కార్మికుల పోరాటాలకు ప్రత్యక్ష నాయకత్వం వహించారన్నారు. కేరళలో కమ్యూనిస్టు పార్టీని అభివృద్ధి చేయడంలో కీలకమైన పాత్ర నిర్వహించారన్నారు. 1964లో సిపిఎం ఏర్పాటు సమయంలో 32 మందిలో విఎస్.అచ్యుతానందన్ ఒకరని తెలిపారు. 1980 నుండి మిగతా 2లో..

కూటమి ప్రభుత్వ బంటుగా ఇపిడిసిఎల్ సిఎమ్‌డి ప్రకటన

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అదానీ విద్యుత్తు స్మార్ట్ మీటర్లు ప్రజల ఇళ్లకు బిగింపు విషయమై ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇచ్చిన ప్రకటన రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి నమ్మిన బంటుగా ఉందని, కూటమి ప్రభుత్వ ప్రజా వంచనకు ఆయన ప్రకటన అద్దం పడుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు ఒక ప్రకటనలోవిమర్శించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలు వద్దని, వినియోగదారులపై ఎటువంటి అదనపు ఛార్జీల భారం పడదని ఆయన ప్రజలను నమ్మించ చూస్తున్నారన్నారు. ఇప్పటికే ఇపిడిసిఎల్ ఏర్పాటు చేసిన మీటర్ల ద్వారా ప్రజలు వినియోగించిన విద్యుత్తుకు బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు. ఇపిడిసిఎల్ బిల్లులు వసూలు చేస్తోందన్నారు. దశాబ్దాలు తరబడి నిరాటంకంగా ఈ పని జరుగుతోందన్నారు. ప్రస్తుత మీటర్లు మార్చి కొత్తగా అదానీ స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రజలు అడిగారా, అసలు ఎందుకు మారుస్తున్నారు ? అని సిఎమ్‌డిని జగ్గునాయుడు ప్రశ్నించారు. సింగిల్ ఫేస్ వినియోగదారులు స్మార్ట్ మీటర్‌కు రూ.8927, త్రీఫేస్ స్మార్ట్ మీటరుకు రూ.17286 వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆ సొమ్మును ఒకేసారి వసూలు చేస్తే ప్రజలు తిరుగుబాటు చేస్తారు కాబట్టి 93 నెలల్లో ప్రతినెలా వినియోగదారుల బిల్లుల నుండి వసూలు చేయాలన్నది ప్రభుత్వ విధానమని చెప్పారు. దీనివల్ల ప్రజలపై రూ.25 వేల కోట్ల అదనపు భారం పడుతుందని, ఇది వాస్తవం కాకపోతే స్మార్ట్ మీటర్లు ఉచితంగా ఏర్పాటు చేస్తామని, ఇటువంటి అదనపు భారాలు వేయమని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ముందు ప్రకటన చేయాలని జగ్గు నాయుడు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు నష్టం లేకపోతే, భారాలు వేయకపోతే ఆ మీటర్లను జగన్ ప్రభుత్వం బిగిస్తే బద్దలు కొట్టండి, కూటమి ప్రభుత్వం వస్తే స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని ప్రతిపక్షంలో ఉండగా ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ఎందుకు ప్రజలకు పిలుపునిచ్చారని ప్రశ్నించారు. అధికారం చేపట్టి మాట తప్పి ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఎందుకు పూనుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ మిత్రుడు అదానీ లాభాల కోసమే ఈ స్మార్ట్ మీటర్లను బిగించడానికి, విద్యుత్తు రంగాన్ని మొత్తం ప్రైవేటీకరించడానికి పూనుకొంటోందని తెలిపారు. అదానీ లాభాల కోసం ప్రజలు ఎందుకు భారాలు భరించాలని సిపిఎం ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం విధానం వల్ల ఇపిడిసిఎల్ సిబ్బంది బిల్లు ఇచ్చిన తర్వాత బిల్లు చెల్లింపుకు వినియోగదారులకు 15 రోజులు గడువు ఉంటున్నదని, అదానీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ముందుగానే ప్రజలు సొమ్ము కట్టాల్సి వస్తుందని అన్నారు. సకాలంలో రీఛార్జ్ చేసుకోకపోతే ప్రజలు చీకటిలోనే గడపాల్సి వస్తుందన్న వాస్తవాలను సిఎమ్‌డి ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. ఎపి విద్యుత్తు నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ప్రభుత్వం నియమించినదని, ఇది చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణ ఒక తంతు మాత్రమేనని అన్నారు. స్మార్ట్ మీటర్లను, ట్రూ అప్ సర్దుబాటు చార్జీలను ప్రజలు, ప్రజాసంఘాలు ఈ మండలి వద్ద వ్యతిరేకించారన్నారు. ప్రజాభీష్టానికి అనుకూలంగా ఏ ఒక్క నిర్ణయం తీసుకొని స్థితిలో ఈ మండలి ఉందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను సర్దుబాటు చార్జీలను వ్యతిరేకించిన టిడిపి, జనసేన,బిజెపి కూటమి నేతలు అవే మీటర్లను, అవేభారాలను ప్రజలపై మోపి ప్రజలను వంచిస్తున్నారన్నారు. దీనికి ఎపి ఇపిడిసిఎల్ సిఎమ్‌డి నమ్మిన బంటుగా ఉపయోగించుకొని ప్రకటన చేయించారన్నారు. ఇప్పటికే తెలియక ప్రీపెయిడ్ మీటర్లను బిగించుకున్న వ్యాపారస్తులకు భారీ కరెంటు బిల్లులు వచ్చి గిజగిజ లాడుతున్నారన్నారు. ప్రజలు, వినియోగదారులు కూటమి ప్రభుత్వ వంచనకు గురికాకుండా అదానీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించకుండా అడ్డుకోవాలని జగ్గునాయుడు పిలుపునిచ్చారు.

మొదటి పేజీ తరువాయి..

ఎయులో బిటెక్ క్వాంటం కంప్యూటింగ్ కోర్సు

ఎట్మాస్ఫియరిక్ సైన్స్, ఎంటెక్ ఓషియానిక్ సైన్స్ కోర్సులలో ప్రవేశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి పున్ణ ప్రారంభించాలని సెనేట్‌లో నిర్ణయించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సులలో ప్రవేశాలు జరుపుతారు. ఇంజినీరింగ్ కళాశాలలో పలు విభాగాల్లో డ్యూయల్ డిగ్రీ చేయడానికి అనుమతులను మంజూరు చేశారు. ఎయు దూర విద్యా కేంద్రం నుంచి అన్ని పీజీ కోర్సులకు వార్షిక పరీక్షల స్థానంలో సెమిస్టర్ పరీక్షల విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. సైన్స్ కళాశాల పరిధిలో పలు విభాగాలలో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదం తెలిపారు. మెరైన్ లివింగ్ రిసోర్స్ విభాగం నుంచి ఏడాది కాలవ్యవధితో పీజీ డిప్లమో కోర్సును ఆక్వా కల్చర్‌లో నిర్వహించడానికి ఆమోదముద్ర వేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం, థియేటర్ ఆర్ట్స్ విభాగాలను సమన్వయం చేస్తూ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఏర్పాటు చేయాలని మాజీ ఉప కులపతులు సూచించారు. ఎయు శతాబ్ది వేడుకలను జరుపుకుంటున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయానికి ప్రత్యేక గ్రాంట్‌ను అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విశ్వవిద్యాలయం తరపున కోరాలని పాలకమండలి సభ్యులు, పూర్వ ఉప కులపతులు సూచించారు. దీనిపై ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జిపి.రాజశేఖర్ స్పందిస్తూ ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలో సమగ్ర ప్రతిపాదనలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాయనున్నామని తెలిపారు. సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌ను బలోపేతం చేయాలని మాజీ వీసీలు సూచించారు. విశ్వవిద్యాలయానికి ఇది మంచి పేరు, ప్రతిష్ట తీసుకొచ్చిందని చెప్పారు. సమావేశంలో ఎయు రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనంజయరావు, మాజీ వీసీలు ఆచార్య ఎల్.వేణుగోపాల్ రెడ్డి, ఆచార్య బీలా సత్యనారాయణ, ఆచార్య జిఎస్ఎన్.రాజు, ఆచార్య జి.నాగేశ్వరరావు, ఆచార్య పివిజిడి.ప్రసాద్ రెడ్డి, పాలకమండలి సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ ఛైర్మన్లు, అకడమిక్ సెనేట్ సభ్యులు పాల్గొన్నారు.

6న జివిఎంసి స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక

పని వేళలలో పొందవచ్చునని తెలిపారు. 29వ తేదీ వరకూ జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ (జనరల్) కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 29న సాయంత్రం 5 గంటల వరకు అందిన నామినేషన్ల జాబితాను ప్రచురిస్తామన్నారు. 30న ఉదయం 11 గంటల నుండి నామినేషన్ స్క్రూటినీ పిదప అదే రోజు అర్హతగల వారి నామినేషన్ల జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. ఆగస్టు 2న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు ఉంటుందని తెలిపారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు. 6న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలోగల సమావేశ మందిరంలో ఎన్నికల ప్రక్రియ, ఓట్ల లెక్కింపు ఉంటుందని, అదే రోజు ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు.

కార్టూనిస్టు ఎంవి.రమణారెడ్డి కన్నుమూత

తదితరులు పేర్కొంటూ సంతాపం తెలిపారు. రమణారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె సుజాత ఐద్వా నాయకురాలు.

ఘన నివాళి

రమణారెడ్డి పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం ఆంధ్ర మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అందజేశారు. తొలుత రమణారెడ్డి పార్థివ దేహం వద్ద ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, సీనియర్ నాయకులు పద్మనాభరాజు, ఎస్.సుధాకర్ తదితరులు నివాళ్లర్పించారు. రమణారెడ్డి కుటుంబాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, నాయకులు రాంబాబు తదితరులు పరామర్శించారు. ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

ప్రజానాట్యమండలి సంతాపం

రమణారెడ్డి మృతికి ప్రజానాట్య మండలి రాష్ట్ర, విశాఖ జిల్లా కమిటీలు సంతాపం తెలిపాయి. కార్టూన్ రంగంలో ఆయన విశేష కృషి సలిపారని సంఘం నాయకులు జి.రమణ గుర్తుచేశారు.

గొప్ప పోరాట యోధుడు అచ్యుతానందన్

1991 వరకు కేరళ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. కేంద్ర కమిటీలో, పొలిట్‌బ్యూరోలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. 2006 నుండి 2011 వరకు ముఖ్యమంత్రిగా ఆయన గొప్ప సేవలందించారన్నారు. 2010లో సిఐటియు రాష్ట్ర మహాసభలు సందర్భంగా విశాఖకు వచ్చారని గుర్తుచేశారు. తదుపరి సిపిఎం అఖిలభారత మహాసభలకు విచ్చేశారని తెలిపారు. మతోన్మాదాన్ని ఎదుర్కోవడంలోనూ, కేరళలో సుపరిపాలన అందించడంలో ఆయన మంచి కృషి చేసారని కొనియాడారు. ఆయన మృతి పార్టీ ఉద్యమానికి, ప్రజలకు తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, జిల్లా కమిటీ సభ్యులు మూర్తి, యు.రామస్వామి, సీనియర్ నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, జి.పోలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌గారూ.. మీకు తగునా..

తన బదిలీ గురించి చెప్పాన్నారు. అయితే ఎంబి పట్నం సచివాలయంలో పోస్టింగ్ ఇచ్చేందుకు ఎంపిడిఒ అభ్యంతరం చెప్పారన్నారు. ఎందుకు అని తాను ప్రశ్నించగా, స్పీకర్ అయ్యన్నపాత్రుడు హోల్డ్‌లో పెట్టాలని తనకు చెప్పారని, స్పీకర్ చెప్పేవరకు తాను చేర్చుకునేది లేదని తెలియజేశారన్నారు. వృత్తి రీత్యా తాను ఎప్పుడూ తప్పు చేయలేదని సాధన చెప్పుకొచ్చింది. రాజకీయ కారణాలతో తనను ఇబ్బంది పెడుతున్నట్లు ఉందని ఆమె చెప్పారు.

ఆర్‌టిసి యూనియన్ నేత తులసీరాంకు మాతృవియోగం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆర్టీసీ యూనియన్ నాయకులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షులు వి.తులసీరాం మాతృమూర్తి వి.లక్ష్మీ నరసమ్మ (103) సోమవారం రాత్రి విజయరామ రెసిడెన్సీ, ఎ బ్లాక్, పాత డెయిరీ ఫాం, ఆనందమార్గ చిల్డ్రన్స్ హోం ఎదురుగాగల తులసీరాం గృహంలో కన్నుమూశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇళ్లపై నీటి ట్యాంకులను శుభ్రపరచాలి : కేతన్‌గార్గ్



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: మహావిశాఖపట్నం నగరపాలక సంస్థ నిత్యం సురక్షిత త్రాగునీటికి క్లోరిన్ కలిపి త్రాగునీటి నాణ్యత పరీక్షల నిర్వహించిన అనంతరమే ప్రజలకు త్రాగునీటి సరఫరా చేస్తున్నారని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న వ్యక్తిగత గృహాలు, బహుళ గృహ సముదాయాలు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, రాజీవ్‌గృహ సముదాయం, జెఎన్ఎస్‌యు, ఆర్ఎమ్ గృహ సముదాయం, కమర్షియల్ భవనాలపై ఉన్న నీటిని నిలువ చేసుకునే ట్యాంకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి శుభ్రపరచుకోవడంతో పాటు తప్పనిసరిగా మూతలు అమర్చి లాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. కలరా, డయేరియా లాంటి వ్యాధులు సంక్రమించకుండా వివిధ జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కమిషనర్ తెలిపారు. ఎక్కడైనా రక్షిత త్రాగునీటి పైపులైన్లు లీకులు, మురికి కాలువలపై పైపులైన్లు లీకులు గమనించిన ఎడల తక్షణమే ఆయా జోనల్ కమిషనర్, ఎమినిటీ వార్డు కార్యదర్శులను గాని, నీటి సరఫరా సహాయక ఇంజనీరునుకు తగిన సమాచారం అందించాలని తెలిపారు. అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నెం. 1800 425 00009 ద్వారా, 0891-2507225 ఫోన్ నెంబర్ ద్వారా సమాచారం అందించాలని తెలిపారు.

వివాదంలో 'అయోధ్య' నమూనా సెట్

(మొదటి పేజీ తరువాయి..)

తమకు ఎటువంటి సమాచారమూ ఇవ్వకుండా శ్రీ సీతారాముల కల్యాణం చేస్తున్నామని అసత్య ప్రచారం చేసారని, ఈ విధంగా కల్యాణం చేయటం దేవాదాయ ధర్మాదాయ శాఖ 30/87 ప్రకారం నియమ నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. ఈ కల్యాణం పేరుతో ఒక్కో జంట వద్ద నుండి రూ.2999ను నిర్వాహకులు వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో కోరారు. భక్తులు ఇటువంటి అసత్య ప్రచారాలు నమ్మి మోసపోవద్దన్నారు. మే 22వ తేదీన ప్రారంభమైన ఈ శ్రీ గరుడ అయోధ్య రామ మందిరం నమూనా సెట్ వద్ద సందర్శకుల నుంచి ఒక్కొక్కరికీ రూ.50 వసూలు చేస్తున్నారు. దీనిని బిజెపి రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్ నిర్వహిస్తున్నారు.

రహదారిని తెరిపించాలి

సిఐటియు ఆధ్వర్యాన కాలనీవాసుల ఆందోళన

ప్రజాశక్తి- మధురవాడ : రహదారిని తెరిపించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన కె1, కె2 కాలనీల ప్రజలు సోమవారం జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద బైఠాయించారు. నగరంలో చిన్న చిన్న వృత్తులు, రోజు కూలి పనులు, ఇతర కాంట్రాక్టు పనులు చేసుకుంటూ, పండ్లు, కూరగాయలు అమ్ముకుంటూ జీవించే పేదలను అన్ని సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తీసుకొచ్చి ఇక్కడ కనీసం రహదారి కూడా లేకుండా చేస్తున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసుల ఆందోళననుద్దేశించి సిఐటియు జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు మాట్లాడుతూ, ఈ రహదారి సమస్యపై అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నారని తెలిపారు. మధురవాడ నుంచి రేవళ్లపాలెం మీదుగా కె1, కె2 కాలనీలకు వెళ్లే బృహత్తర ప్రణాళిక రహదారి నిర్మాణం చేశారని, ఈ రహదారిలో జవహర్ నవోదయ విద్యాలయం వద్ద కొంత స్థలం తమదంటూ కొంత మంది వేసిన కేసులతో ఎప్పటికప్పుడు రహదారిని మూసివేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యను మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడ నివసించే వారంతా పేదరికంతో, అతితక్కువ ఆదాయాలతో దూర ప్రాంతాలకు వెళ్లి పని చేస్తున్నారని తెలిపారు. తెల్లవారి 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఉపాధి కోసం వెళ్లి వస్తుంటారని చెప్పారు. ఆర్‌టిసి బస్సులు, ఆటోలపై ప్రయాణం చేస్తుంటారని, వీరి ప్రయాణానికి ఈ రహదారి తప్ప వేరే మార్గం లేదని తెలిపారు.

రహదారి సమస్యను పరిష్కరించకపోతే కదిలేది లేదని భీష్మించి కూర్చోవడంతో జోనల్ కమిషనర్ కనక మహ లక్ష్మి సంఘటనా స్థలం వద్దకు వెళ్లి రహదారి తెరిపించే ప్రయత్నం చేయగా స్థలం ఆక్రమణ దారులు, వారి తరుపు న్యాయవాది దౌర్జన్యం చేశారని వివరించారు. తరువాత కాలనీల ప్రజలు చేరుకొని దారి తెరవాలని కోరితే వారిపై కూడా న్యాయవాది దౌర్జన్యానికి దిగారని తెలిపారు. మహిళలపై కూడా చేయి చేసుకున్నారని, సంబంధిత న్యాయవాదిపై పిఎం.పాలెం పోలీస్ స్టేషన్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారని తెలిపారు. స్థానిక కార్పొరేటర్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.రాజుకుమార్, మధురవాడ దళిత సంఘాల నాయకులు సియ్యాద్రి కనకరాజు, టి.అవతార్‌సింగ్, కె.చిన్ని, వాసంతి, ఎమ్‌డి.హుస్సేన్‌బాబా ఫాల్గుణ, చంద్రకళ, రాము తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు, సిఐటియు నాయుకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్య పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాఠశాల విద్యార్థి మృతి చెందినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఘటనకు సంబంధించి సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 6వ వార్డు పరిధి బక్కన్నపాలేనికి చెందిన హర్షవర్ధన్‌సింగ్(13) స్థానికంగా ఉన్న పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం అనారోగ్యం కారణంగా పాఠశాలకు వెళ్లలేదు. సాయంత్రం ఇంటి నుంచి సైకిల్‌పై వస్తుండగా పిఎం.పాలెం నుంచి బక్కన్నపాలెం వెళుతున్న బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. పిఎం.పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - ఆరిలోవ : లారీ బ్రేక్ ఫెయిలై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన సోమవారం తెల్లవారు జామున హనుమంతువాక నుంచి అడివివరం వెళ్లే బిఆర్‌టిఎస్ రోడ్డులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడివివరం నుంచి హనుమంతువాక వైపు క్వారీ లారీ వెళ్తోంది. ఒక్కసారి బ్రేక్ ఫెయిల్ అవడంతో లారీ డ్రైవర్ చాకచక్యంగా డివైడర్‌ను ఢీకొట్టించాడు. మధ్యలో ఉన్న విద్యుత్ స్థంబాన్ని ఢీకొన్న తర్వాత లారీ ఆగిపోయింది. దీంతో సర్వీసు రోడ్డులో ప్రయాణిస్తున్న ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బీచ్‌లో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - ఆరిలోవ : జోడుగుళ్లపాలెం బీచ్‌కు సోమవారం ఉదయం ఒక గుర్తు తెలియని 50 నుంచి 60 ఏళ్ల వయసున్న పురుషుని మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానికులు గమనించి విఆర్‌ఒకు చెప్పడంతో ఆయన ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదుచేశారు. మృతదేహాన్ని కెజిహెచ్ శవాగారానికి తరలించి భద్రపరిచారు. మృతుని వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై ఉపమాక రోడ్డు జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఉద్దండపురం నుండి బొండాడ అప్పారావు, పెండ్యాల దుర్గాప్రసాద్ బైక్‌పై అడ్డురోడ్డు వెళ్లి తిరిగి వస్తుండగా ఉపమాక జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న ప్రైవేటు స్కూలు బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక 50 పడకల ఆసుపత్రిలో ప్రధమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం తుని ఆసుపత్రికి తరలించారు.

ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ రైతు సేవా కేంద్రంలో రైతులకు ఎరువులను కూటమి నాయకుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రం విఎఎ ఎస్.ఉమాపార్వతి మాట్లాడుతూ, మన కేంద్రంలో యూరియా 45 కేజీలు, డిఎపి 50కేజీలు, ఫొటాస్ (యమ్ఒపి) 50 కేజీలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీతో ఎరువులను ఇస్తుందని చెప్పారు. రైతుల అభ్యర్థన మేరకు పైఅధికారులతో మాట్లాడి పురుగు, గడ్డి మందులు కూడా అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పాండ్రంగి పిఎసిఎస్ చైర్మన్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, రైతులు పురుగు మందులను పిచికారీ చేసే పంపులను అందుబాటులో ఉంచుతామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లి మహేష్, నాయకులు మహంతి అప్పలరమణ, పి.రమణ, సోమునాయుడు, పి.వెంకటరావు, కె.వెంకటరమణ, కోన గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ- 2 బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమునిపట్నం మండల ఎంఇఒ- 2గా మండలంలోని తాటితూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు సోమవారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇదే హోదాలో పనిచేసిన జయప్రద అనారోగ్య కారణంగా మెడికల్ లీవ్ పెట్టిన నేపథ్యంలో హెచ్‌ఎం శ్రీనివాసరావుకు ఈ అదనపు బాధ్యతలు అప్పగించినట్లు విద్యా శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

డి.శ్రీనివాసరావు ఎంఇఒ-2గా అదనపు బాధ్యతలు చెపట్టడం పట్ల తాటితూరు జెడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అతన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టిఎస్‌వి.ప్రసాదరావు, సూర్యనారాయణ, తారకేశ్వరరావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ చైర్మన్‌గా అప్పలనాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం కో-ఆపరేటివ్ సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన మొకర అప్పలనాయుడు సోమవారం సహకార బ్యాంకు భవనంలో బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కె.రమణ, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రామస్వామినాయుడు, కె.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

మెదడు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే ముప్పు



కేర్ వైద్యులు కిశోర్‌బాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : మానవ శరీరాన్ని నియంత్రించే అత్యంత ముఖ్యమైన అవయవమైన మెదడు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే జీవితానికి ముప్పు రావచ్చని కేర్ ఆసుపత్రి వైద్యులు సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ జి.కిశోర్‌బాబు హెచ్చరించారు. ప్రపంచ బ్రెయిన్ డే సందర్భంగా మెదడు సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించి, మెదడు ఆరోగ్య పరీక్షలను ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఏడాది థీమ్‌గా మెదడు ఆరోగ్య సమస్యలు, తీసుకోవలసిన ముందస్తు చర్యలు అనే అంశంపై కేర్ వైద్యులు పలు సూచనలు చేశారు. ప్రారంభ దశలోనే గుర్తింపు, తగిన చికిత్స, మెదడు ఆరోగ్యాన్ని నిలబెట్టే జీవన శైలిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్ట్రోక్, ఎపిలెప్సి, డిమెన్షియా, మల్టిపుల్ స్కిలోరోసిన్, మెదడు కేన్సర్ వంటి వ్యాధులు ఇప్పుడు యువతను, వృద్ధులను ఒకేలా ప్రభావితం చేస్తున్నాయని, దీనికి ప్రధానంగా పెరిగిన ఒత్తిడి, కూర్చునే జీవనశైలి, అవగాహన లోపమే కారణమని వివరించారు. మెదడు వ్యాధి అంటే స్ట్రోక్ లేదా కేన్సర్ అని చాలా మంది అనుకుంటారని, కానీ అసలైన మౌన మృత్యుదూతలు, స్ట్రెస్, మానసిక అలసట, డిజిటల్ ఓవర్‌లోడ్ ఉద్యోగ జీవితంలో ఉన్నవారిని వేధిస్తున్నాయని తెలిపారు. ఫోకస్ లోపం, చిరాకు, నిద్రలేమి, మరచిపోవడం వంటి లక్షణాలను నిర్లక్షం చేస్తుంటారని, ఇవి చిన్న విషయాలు కాదని పేర్కొన్నారు. ఇవే హెచ్చరికలు మెదడుకు ముప్పు కావచ్చని డాక్టర్ కిషోర్‌బాబు తెలిపారు. ఆధునిక ఉద్యోగాలు మానసిక ఒత్తిడికి గురయ్యే వాతావరణం, నిరంతరం స్క్రీన్‌లను చూడటం, మానసిక విశ్రాంతి లేకపోవడం మెదడును చెడు దిశలో మలుస్తున్నాయని సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎంజివి.ఆదిత్య పేర్కొన్నారు. ప్రతి రోజూ 7 నుంచి 8 గంటలు నాణ్యమైన నిద్రపోవడం, బి.విటమిన్లు, ఒమెగా -3, ఫ్యాటీ యాసిడ్లు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం వంటివి మెదడకు మేలు చేస్తాయని వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్న పిల్లల స్క్రీన్ టైంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రాథమిక దశలోనే మెదడు అభివృద్ధి జరుగుతుందని, ఈ దశలోనే స్క్రీన్ ఎక్కువగా చూసినట్లయితే పిల్లల్లో భావోద్వేగ నియంత్రణ, దృష్టి వ్యవధి, మాట్లాడే నైపుణ్యాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు.

భద్రతపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : భద్రతా పరంగా అవగాహన పెంచుకోవాలని ఉద్యోగులు, కార్మికులకు ఎపి డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.చంద్రశేఖర్‌వర్మ సూచించారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్‌లో నిర్వహించిన 54వ జాతీయ భద్రతా ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు సభకు ముఖ్య అతిథిగా చంద్రశేఖర్‌వర్మ హాజరై మాట్లాడుతూ, భద్రతా పరంగా దివీస్ యాజమాన్యం రాజీ పడకుండా అత్యంత అధునాతనమైన పరికరాలను, యంత్రాలను అందుబాటులో ఉంచుతుందన్నారు. పని ప్రదేశంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకరరెడ్డి మాట్లాడుతూ, భద్రత విషయంలో దివీస్ సంస్థ నిబద్ధతను ప్రశంసించారు. దివీస్ సంస్థ సేఫ్టీ అధికారి ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ, భద్రతా ఉత్సవాల సందర్భంగా భద్రతపై ఉద్యోగులకు, కార్మికులకు పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు వివరించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిఎంలు వైఎస్.కోటేశ్వరరావు, కె.సుబ్బారావు, ఈ.రామకృష్ణ, రమేష్‌బాబు, ఐఎల్.ప్రసాద్, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-మధురవాడ : ఆన్‌లైన్ డిజిటల్ లావాదేవీలు సౌకర్యవంతమైనవే అయినప్పటికీ, అవి సురక్షితంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి వినియోగదారుడిపైనా ఉందని జిల్లా వినియోగదారుల కమిషన్ మాజీ సభ్యులు, సీనియర్ మహిళా న్యాయవాది బి.వరలక్ష్మి పేర్కొన్నారు. భారత ప్రజా సంబంధాల సంఘం (పిఆర్‌ఎస్‌ఐ) విశాఖ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె "ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో వినియోగదారుల అవగాహన" అనే అంశంపై ప్రసంగించారు. వినియోగదారులు అనేక సేవలు, ఉత్పత్తులు ఇంటి నుండి ఆన్‌లైన్ ద్వారా పొందుతున్నారని, అదే సమయంలో మోసాలు, నకిలీ వెబ్‌సైట్లు, డేటా చోరీ వంటి ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని వివరించారు. వినియోగదారులు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డివిఆర్.మూర్తి మాట్లాడుతూ యూరోపియన్ దేశాలు వినియోగదారులకు కేవలం తమ హక్కుల గురించి తెలియజేయడమే కాకుండా, దీర్ఘకాలిక సంతృప్తి కోసం జీవితం మొత్తం సేవలు అందించే విధానాలను కూడా ప్రవేశపెట్టాయని తెలిపారు. పిఆర్‌ఎస్‌ఐ విశాఖ శాఖ అధ్యక్షుడు ఎమ్‌కెవిఎల్.నరసింహం మాట్లాడుతూ, భారతదేశంలో డిజిటల్ వినియోగదారుల సంఖ్య వేగంగా పెరుగుతుండటంతో, ప్రతి వ్యక్తీ తన హక్కులు, కర్తవ్యాలు గురించి తెలుసుకోవడం అవసరమన్నారు. అనంతరం ఇటీవల పిఆర్‌ఎస్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ పిఎల్‌కె.మూర్తిని సన్మానించారు. పిఆర్‌ఎస్‌ఐ విశాఖ శాఖ కార్యదర్శి ఎ.గోవిందరావు, కోశాధికారి ఎన్‌వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

తీరం కోతకు గురిగాకుండా చర్యలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బోయివీధి, తోట వీధిలో బీచ్ కోతకు గురిగాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ జోనల్ కమిషనర్ బమ్మి అయ్యప్పనాయుడుకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమ వారం వినతిపత్రం అందజేశారు. జివిఎంసి మూడో వార్డు పరిధి పోలమాంబ గుడి నుంచి బోయివీధి, తోట వీధి మీదుగా సముద్రం కోతకు గురిగాకుండా రక్షణ గోడ నిర్మించాలని కోరారు. సముద్రం అంచెలంచెలుగా ముందుకు రావడంతో ఆయా ప్రాంతాల్లో తీరానికి అనుకుని నివాసాల్లో ఉన్న మత్స్యకార కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సిహెచ్.రమణ, కె.నాగరాజు, ఎం.సంజీవ్‌కుమార్, వి.సత్యారావు, టి.రామదాసు, కొక్కిరి అప్పన్న, జె.మురళి తదితరులు ఉన్నారు.

వైసిపి మండల అధ్యక్షుని సోదరుడు మృతి

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని కోరాడ గ్రామానికి చెందిన కోరాడ రాము సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతి చెందిన రాము తమ్ముడు లక్ష్మణరావు వైసిపి మండల అధ్యక్షునిగా ఉన్నారు. రాము 5వ బెటాలియన్‌లో పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. నెల రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై చికిత్స పొందుతూ మృతిచెందారు.



మృతిచెందిన రాము (ఫైల్‌ఫొటో)

దళితుల చైతన్యంతో చట్టాల అమలు

ప్రజాశక్తి-సీతమ్మధార : దళితులు చైతన్యవంతులై నిలదీస్తేనే చట్టాలు పక్కగా అమలు జరుగుతాయని, ఆదిశగా ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత దళిత సంఘాలపై ఉందని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఆచార్య కెఎస్‌చలం అన్నారు. పౌర గ్రంథాలయంలో వివిధ దళిత సంఘాల నాయకులతో సోమవారం జరిగిన చర్చా గోష్టిలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా దళితులపై అంతులేని వివక్ష కొనసాగుతోందని, దళిత, ఆదివాసీలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయని తెలిపారు. ఎక్కడ, ఏ స్థితిలో ఉన్నా దళితులను నిర్మూలిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్‌సి, ఎస్‌టిలు, ఇతర మతాల్లో ఉన్న దళితులు సోదర భావంతో ఐకమత్యంగా ఉంటేనే చట్టాలు అమలు సాధ్యపడుతుందన్నారు.

కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి మాట్లాడుతూ, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం అమలు తీరు చాలా దారుణంగా ఉందన్నారు. ఇప్పటికీ వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయంటే చట్టాలు అమలు ఎంత దారుణంగా ఉందో అర్థం అవుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార చట్టం అమలు తీరుపై నివేదిక రూపొందించామని, దీన్ని అమలుచేయడంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని తెలిపారు. ఈ చట్టాన్ని అమలు చేస్తున్న తీరుపై ఆడిట్ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినట్టు చెప్పారు. దళితులపై దేశవ్యాప్తంగా జరుగుతున్న అత్యాచారాలపై 20 అంశాల్లో నివేదిక రూపొందించామని తెలిపారు. చాలా కేసుల్లో పోలీసులు స్పందించిన తీరు దారుణంగా ఉందన్నారు. రోజుకు 6 అత్యాచారాలు, వారానికి నాలుగు రేప్‌లు, నెలకు 5 హత్యలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వీటిని నియంత్రించడంలో యంత్రాంగం పూర్తిస్థాయిలో విఫలమవుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బి.కల్యాణరావు, వివిధ దళిత సంఘాల నాయకులు జెవి.ప్రభాకరరావు, టి.విజయకుమార్, థామస్ పల్లితనం, కొరివి వినయ్‌కుమార్, ఎ.దేవకుమార్, మంజు, వి.ఉదయ్ కుమార్, కె.శిరీష, జి.నరసింహులు, బూసి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



చర్చాగోష్టిలో పాల్గొన్న కెఎస్.చలం తదితరులు


ఎన్‌వి.రమణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు

ఎన్‌వి.రమణకు నివాళి

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 63వ వార్డు సిపిఎం క్రాంతినగర్ శాఖ మాజీ కార్యదర్శి ఎస్.వెంకటరమణ అకాల మరణం పార్టీకి, క్రాంతి నగర్ ప్రజలకు తీరని నష్టం అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. ఎన్‌వి.రమణ భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, క్రాంతినగర్ సమస్యలపై శాఖలోని సభ్యులందరిచే వెంకటరమణ పనిచేయించేవారని తెలిపారు. సిఐటియు, డివైఎఫ్ఐ సంఘాల అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. ఈ సంతాప సభలో సిపిఎం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, ఎ.సత్యారావు, బాబూరావు, ఆర్.విమల, వై.కల్యాణి, డివైఎఫ్ఐ నాయకులు ఎస్.వాసు, సమీర్, జి.నరేష్, రామకృష్ణ, ప్రేమ్, ఐద్వా నాయకులు ఎం.జయలక్ష్మి, పి.వరలక్ష్మి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎం.ఆదినారాయణ, మురళి, కుమారి, దొడ్డమ్మ, కుటుంబ సభ్యులు ఎన్.శ్రీనివాసరావు ఆదిలక్ష్మి, పాల్గొన్నారు.

పరిశుభ్రంగా రైల్వే స్టేషన్ పరిసరాలు

-జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి- సీతమ్మధార : రైల్వే స్టేషన్ పరిసరాలలో వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ రైల్వే, జివిఎంసి ప్రజా ఆరోగ్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 41వ వార్డు పరిధిలోని రైల్వే స్టేషన్ నుండి తాడిచెట్లపాలెం వరకు పర్యటించారు. రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఎదురుగా పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. రైల్వే జనరల్ టికెట్ కౌంటర్, కార్ పార్కింగ్, ఆటో స్టాండ్ తదితర ప్రాంతాలలో రైల్వే స్టేషన్ పర్యవేక్షకులు జిసి.నాయక్, ఆర్పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణతో కలిసి పరిశీలించారు. రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఉన్న దుకాణాల వద్ద, పరిసర ప్రాంతాలలో అధికంగా వ్యర్థాలు ఉండడాన్ని గమనించి పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆటో స్టాండ్ వద్ద వ్యర్థాలు తొలగించనందున రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రైల్వే యాజమాన్యానికి నోటీసులు జారీ చేయాలని జోనల్ కమిషనర్ రామును ఆదేశించారు.

92వ వార్డులో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు వెంకటాపురం, గొల్లవీధిలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్ల వీధిలో బెల్ట్ షాపుపై దాడి చేసి ఎనిమిది మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మద్యం అక్రమంగా అమ్ముతున్న ఊరుకోటి పైడిరాజుపై కేసు నమోదు చేశారు. సరైన రికార్డులు లేని ఆరు మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి-యంత్రాంగం

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గ పరిధి గుర్రంపాలెం గ్రామంలో 'సుపరిపాలనలో - తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, నియోజకవర్గం పరిశీలకులు కోరాడ రాజబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు హాజరయ్యారు. గుర్రంపాలెంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కరపత్రాలను అందజేశారు. అనంతరం మంత్రి అచ్చన్నాయుడు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి మల్లయ్యపాలెంలో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యాన కరపత్రాలను పంపిణీచేశారు. ఏడాదిలో చేసిన అభివృద్ధిని వివరించారు. స్థానికంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎపిటిడిసి ఇన్‌ఛార్జి ఆర్‌డి.జగదీష్, అసిస్టెంట్ మేనేజర్ బసంత్, మాధవి, కార్పొరేటర్లు లొడగల అప్పారావు, పిల్లా మంగమ్మ పాల్గొన్నారు.

క్లాప్ లోడర్లకు బకాయి జీతాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ఎం.రాంబాబు, కార్మికులు

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : గాజువాక జోన్‌లో పనిచేస్తున్న క్లాప్ ఆటో, చెత్త బళ్ళ, లోడర్ల బకాయిలు చెల్లించాలని సిఐటియు నాయకులు రాంబాబు డిమాండ్‌చేశారు. ఈ మేరకు జివిఎంసి కాంట్రాక్ట్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన గాజువాక జోన్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రాంబాబు మాట్లాడుతూ, మాయమాటలతో కాంట్రాక్టర్ కాలయాపన చేస్తున్నారని, ఇఎస్ఐ, ఇపిఎఫ్ చెల్లించటం లేదని తెలిపారు. పని ప్రదేశంలో కార్మికులు ప్రమాదాలకు గురైనా పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి నెలా జీతాల్లో కోత, విధించి చేతికి రూ.8,000 మించి ఇవ్వడంలేదన్నారు. వడదెబ్బతో విధుల్లో ఉండగా మరణించిన లోడర్ గంగాభవాని కుటుంబ సభ్యులకు ప్రకటించిన రూ.2,50,000 చెక్కులు నేటికీ చెల్లించలేదని తెలిపారు. ప్రతి నెలా లోడర్లు ధర్నా, నిరసన, బంద్ చేస్తే తప్ప జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గొలగాని అప్పారావు, నక్క నాగరాజు , ధనరాజ్, చంటి, మహేష్, లక్ష్మి, కనక పాల్గొన్నారు.

అనకాపల్లి : జీవీఎంసీ అనకాపల్లి జోన్లో పనిచేస్తున్న క్లాప్ వాహన లోడర్లకు బకాయి ఉన్న రెండు నెలల జీతం చెల్లించాలని కోరుతూ సోమవారం జీవీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ లోడర్లకు ఇచ్చే అతి తక్కువ జీతం కూడా ప్రతి నెలా చెల్లించకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. తక్షణమే జీతాలు చెల్లించకుంటే బంద్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం సంఘం నాయకులు వై భారతి, ప్రసాదు, భాస్కరరావు, భవాని తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు ఆరోపించారు. జివిఎంసి 25వ వార్డులో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రతిపక్ష నాయకులపై కక్షపూరిత రాజకీయాలు చేయడం తప్ప అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి లేదన్నారు. అనంతరం రెల్లి వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కూటమి ప్రభుత్వ పాలకుల మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బోగవల్లి గోవిందు, సంపంగి శ్రీనివాసరావు, అంబటి శైలజ, ముద్దల సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి- వేపగుంట : బాజీజంక్షన్ సంత సముదాయంలో బోరు ఏర్పాటుకు 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్తకులు ఎప్పటినుంచో బోరు వేయమని కోరుతుండటంతో ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకెళ్లగా జివిఎంసి నిధులతో బోరు మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ వీరయ్య, గోవింద్, శరగడం అరుణ్, రమణ, బొమ్మిడి రాజు, శ్రీనుపట్నాయక్, నమ్మి రవి పాల్గొన్నారు.

గాయపడిన వారికి 'పంచకర్ల' సహాయం

ప్రజాశక్తి- వేపగుంట : అనకాపల్లి కలెక్టర్ ఆఫీస్ సమీపంలో వ్యానును ఢీ కొట్టి కిందపడి గాయాలపాలైన ద్విచక్ర వాహనదారులకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సహాయం చేశారు. ప్రమాద ఘటనను చూసి వెంటనే కారు ఆపి దగ్గరకు వెళ్లారు. ఆటోను రప్పించి గన్‌మ్యాన్ సహాయంతో వారిని ఆసుపత్రికి తరలించారు.

ప్రయివేటు ఆసుపత్రుల్లో ధరల పట్టిక ఉండాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లాలోని అన్ని ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, క్లినిక్‌లు నిర్వహిస్తున్న యాజమాన్యాలు ధరల పట్టికను తెలుగు, ఇంగ్లీష్ బాషలలో అందరికీ కనిపించే విధంగా ఆయా సెంటర్లలో ప్రదర్శించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వసూలు చేసే ధరలను ప్రదర్శించడమే కాకుండా వాటికి సంబంధించిన రశీదు కూడా పేషెంట్లకు ఇవ్వాలని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. 51వ వార్డు పరిధి కళింగనగర్, మాధవధారలో రూ.60 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపన చేశారు. 46వ వార్డు పరిధి కస్తూరినగర్, లక్ష్మీనారాయణపురం దగ్గర సుమారు రూ.90 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశాఖను మరింత అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కోటి రూపాయలకు పైగా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, ఇఇ దిలీప్‌కుమార్, డిఇ భరణి, ఉత్తర నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఉషాకిరణ్, శ్యామల దీపికా, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : రుషికొండ బీచ్‌లో రూ.55 లక్షలతో నిర్మించనున్న 22 శౌచాలయాలు, మల్లయ్యపాలెంలో రూ.99 లక్షలతో ప్రతిపాదించిన సిసి రోడ్లు, పార్కు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రుషికొండలో శౌచాలయాలు నిర్మిస్తున్నప్పటికీ సరైన నీటి సౌకర్యం లేకపోవడం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ శ్రీనివాసరావు

అంతర్జాతీయ ప్రమాణాలతో గీతం కోర్సులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, లా, ఆర్కిటెక్చర్, మెడికల్, పారామెడికల్, ఫార్మసీ, నర్సింగ్, ఫిజియోథెరపి వంటి వృత్తి విద్యాకోర్సులతో పాటు బిఎస్‌సి, ఎమ్మెస్సీ, బిఎ, బికామ్, ఎమ్ఎ వంటి కోర్సులను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని, విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామని గ్రీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు 'దీక్షారంభ్' పేరిట సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అదాని స్మార్ట్ విద్యుత్ మీటర్లను అడ్డుకోండి

వార్వా, నివాస్ ఆధ్వర్యాన విస్తృత ప్రచారం



అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

అదాని స్మార్ట్ విద్యుత్ మీటర్లు వెయ్యకుండా ప్రతి విద్యుత్ వినియోగదారుడు అడ్డుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం, వార్వా, నివాస్ ఆధ్వర్యాన సోమవారం అగ్రేపు గీతాంజలి, గీతాంజలి, ఎస్ఎంపిపి అపార్మెంట్లలో ప్రచారం నిర్వహించారు. ముఖ్యంగా స్మార్ట్ మీటరు పెడితే సెల్‌ఫోన్ పద్ధతిలో ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జి చేయించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రీపెయిడ్ చేసిన డబ్బులు అయిపోతుండగా మెసేజ్ పెడతారని, మెసేజ్ చూడకపోయినా, ఆ సమయానికి డబ్బులు లేకపోయినా కరెంటు ఆగిపోతుందని తెలిపారు. ఇప్పటిలాగా 15 రోజులు ఆగి కట్టే అవకాశం లేకుండా పోతుందన్నారు. ఇందులో జవాబుదారీతనం ఉండదని పేర్కొన్నారు. కరెంట్ డిమాండ్‌ను బట్టి పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు, చలికాలం ఒకరేటు, వేసవికాలం మరో రేటు, ఎప్పుడు పడితే అప్పుడు రేట్లు పెంచే అవకాశం ఉంటుందని తెలిపారు. నేడు జియో, ఎయిర్‌టెల్ సంస్థలు అడ్డగోలుగా దోచుకుంటున్న మాదిరిగానే భవిష్యత్తులో కరెంటుకు కూడా అదే గతి పడుతుందని చెప్పారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేయడానికి మోడీ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. అందరం కలిసి ఈ స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్వా-నివాస్ కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, సభ్యులు పెంటకోట శ్రీనివాసరావు, కశ్శ తేలయ్యబాబు, అపార్మెంట్ల అధ్యక్ష కార్యదర్శులు కె.పైడిరాజు, కె.రామకృష్ణ, వసంతరావు, బాలిశెట్టి మహేష్, కె.సురేంద్ర పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని నిరసన

పరవాడ : విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దారు జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యాన గృహ వినియోగదారులు నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్ల వలన భారీగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయన్నారు. ఎన్నికల్లో కూటమి నేతలు విద్యుత్ మీటర్లను రద్దు చేస్తామని, విద్యుత్ ఛార్జీలు పెంచబోమని వాగ్దానం చేస నేడు అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చడం దారుణమన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని ప్రజలపై విద్యుత్ భారాల ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వి.అప్పలరాజు, పి.అప్పలనాయుడు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు, కార్మికులు



కొవ్వొత్తులు, లాంతర్లతో నిరసన తెలుపుతున్న దృశ్యం

కెవిపిఎస్ ఆధ్వర్యాన వినూత్న నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు, లాంతర్లతో వినూత్నరీతిలో నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో అదానీ జేబులు నింపేందుకు చూస్తోందని దుయ్యబట్టారు. టిడిపి అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పిందన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి వస్తే పేద ప్రజలకు విద్యుత్ అందక కొవ్వొత్తులు, లాంతరు దీపాలే మరలా దిక్కవుతాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు సత్రమంగా 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న డిజిటల్ మీటర్లను కొనసాగించాలన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కె.చంద్రశేఖర్, ఎంవి.ప్రసాద్, కె.నర్సింగరావు, ఎర్రిబాబు, చంద్రమౌళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్

పాడి రైతుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-కె.కోటపాడు : పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ అన్నారు. సోమవారం చౌడువాడ పాల ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 650 మంది పాడి రైతులతో చౌడువాడ సొసైటీ అత్యధిక లాభాలతో నడుస్తుందన్నారు. సొసైటీ లాభాలను ప్రతి ఏటా పాడి రైతులకు బోనస్‌ల రూపంలో అందిస్తున్నామని చెప్పారు. ఈ సంవత్సరం రైతుల సంక్షేమానికి రూ.26 లక్షలు ఖర్చు చేయగా, డబల్ బోనస్‌గా రూ.34 లక్షలు అందించినట్లు తెలిపారు. సబ్సిడీపై మిశ్రమ దాణా, నీటి వసతికి బోర్లు ఏర్పాటు తదితర అనేక సదుపాయాలు రైతులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కేవీ రమణ, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రాజి నాని, ఎంపిటిసి సభ్యుడు రాజేష్, సొసైటీ కార్యదర్శి చిన్ని వెంకట నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ స్క్రీనింగ్ కేంద్రాల్లో ఉచిత పరీక్షలు


ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మాకవరం, మార్టూరు, ఊడేరు, మామిడిపాలెం, సంపత్ పురం గ్రామాలలో సోమవారం కిడ్నీ సంబంధ సమస్యలపై స్క్రీనింగ్ కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఎక్కువగా మైనింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో ప్రజలు కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ, మరణించిన సందర్భాల నేపథ్యంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ గమనించి ప్రజలందరికీ రక్త పరీక్షలు, సీరం క్రియాటిన్ టెస్టులు చేయించడం జరిగింది. ఎవరికైనా కిడ్నీ వ్యాధి నిర్ధారణ అయిన వారిని రక్షించుకోవడానికి అవకాశాలు ఉన్నాయని ఈ సందర్భంగా రామకృష్ణ తెలిపారు. తుమ్మపాల, తగరంపూడి, కసింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వైద్యాధికారులు నీలిమారాణి, మేఘన, వాణి, సుధాకర్, యశోద, తిరుపతిరావు తదితరులు ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, సర్పంచులు ఎంపిటిసిలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం వల్లే రోడ్లు శిథిలం

ప్రజాశక్తి-అనకాపల్లి : గత ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం వల్లే జిల్లాలో రోడ్లు శిథిల స్థితికి చేరాయని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. గుండాల జంక్షన్ దగ్గర నుంచి తుమ్మపాల చినబాబు కాలనీ వరకు జరుగుతున్న రహదారి పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం, నిధులు కేటాయించకపోవడం వలన రోడ్లన్నీ శిథిలస్థితికి చేరాయన్నారు. వర్షాకాలం ముందుగానే ఈ పనులన్నీ పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ సోమవారం పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా కష్టపడి 100శాతం మార్కులు సాధించి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలని ఈఈ సందర్భంగా హెచ్ఎం ఎ.శేఖర్, ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బొడ్డు శివ ప్రసాద్, సూరెడ్డి బాబురావు, ట్రస్ట్ సభ్యులు ఏవీఎస్ఎన్ మూర్తి, లెక్కల సత్యనారాయణ, లెక్కల మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య వివాహ పరిచయ మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు

ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదికకు స్పందన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక పెంటకోట కన్వెన్షన్‌లో ఆర్యవైశ్య మహాసభ వారు సోమవారం నిర్వహించిన వివాహ పరిచయ వేదిక దిగ్విజయంగా జరిగింది. ఈ వివాహ పరిచయ వేదికలో 1500 మంది హాజరు కాగా 465 మంది సభ్యులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ప్రతినిధులు తెలియజేశారు. వచ్చిన వారిలో 14 జంటలుగా మారారని, ఇంకా ఐదు జంటలుగా మారేందుకు అంగీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య స్టేట్ ప్రెసిడెంట్ చిన్ని రామ సత్యనారాయణ, స్టేట్ ఆరోగ్యశాఖ వైద్య శాఖ చైర్మన్ కారుమూరి మహేష్, అనకాపల్లి జిల్లా ప్రెసిడెంట్ మధు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనాథ్ శ్రీను, ట్రెజరర్ సంతోష్, నుదురుపాటి తాతాజీ, సుతాపల్లి కళ్యాణ్ కుమార్, పలు జిల్లాల నుండి ఆర్యవైశ్యుల పెద్దలు పాల్గొన్నారు.

పచ్చి రొట్ట ఎరువుతో మట్టికి జీవం

కలెక్టర్ విజయ కృష్ణన్



జీవన ఎరువులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జెసి జాహ్నవి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

పచ్చి రొట్ట ఎరువుతో మట్టికి జీవం వస్తుందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పచ్చి రొట్ట ఎరువులకు సంబంధించి గోడ పత్రికలను సోమవారం జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవితో కలిసి ఆమె కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట పైర్లను వాడటం ద్వారా 25శాతం ఎరువులు ఆదా అవుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువులు/పిఎండిఎస్ (వర్షాకాలానికి ముందు పొడి విత్తనాలు విత్తడం) వాడటం వలన నేల సారం పెంపు, నేల నిర్మాణం పటిష్టం, ఆరోగ్యకరమైన నేల, నేలలో పోషకాల వృధా తగ్గింపు, సాగు ఖర్చులు తగ్గిస్తుందని వివరించారు. 25శాతం ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తాయన్నారు. రైతులు జీవన ఎరువులు వినియోగిస్తే 10శాతం ఎరువులు ఆదా చేయవచ్చని చెప్పారు. దీనికి సంబంధించి అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రైతు సేవ కేంద్రాల వద్ద గోడ పత్రికలను ప్రదర్శించాలని సూచించారు. ఈ గోడపత్రికను ప్రింట్ చేసి ప్రతీ డీలరు షాపు ముందు ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు, కెఆర్ఆర్‌సి పత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్ సుబ్బలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి. మోహన్ రావు, జిల్లా గృహనిర్మాణ శాఖ పథక సంచాలకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూసేకరణ ప్రతిపాదనలు నిలిపివేయాలి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం, మల్లాం, అప్పంపాలెం, ఆర్ శివరాంపురం, ఎం భూపతిపాలెం గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటుకు చేపడుతున్న భూసేకరణను నిలిపివేయాలని రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కోన మోహనరావు, బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని మల్లాం, అప్పంపాలెం, ఆర్ భీమవరం తదితర గ్రామాల్లో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఏడు గ్రామాల పరిధిలో పరిశ్రమల కోసం సుమారు 1690.11 ఎకరాల భూమి సేకరణకు ప్రభుత్వ అధికారులు ప్రతిపాదనలు పెట్టారన్నారు. భూసేకరణకు సంబంధించి ఎటువంటి పబ్లిక్ నోటీసును ఇవ్వలేదని, మండల అధికారులు గ్రామ సభలను కొద్దిమందితో తూతూమంత్రంగానే జరుపుతున్నారని తెలిపారు. రైతులు ఈ భూసేకరణను వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘము నాయకులు కోన మోహనరావు, రైతులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ప్రభుత్వ వైద్య, ఆరోగ్య సేవలు గ్రామ స్థాయిలో ప్రజలకు అందుతున్న తీరును పరిశీలించడానికి అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్ ఫోర్స్ టీం సోమవారం బుచ్చయ్యపేట ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను, పొట్టి దొరపాలెం హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను తనిఖీలు చేసింది. కార్యక్రమంలో జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ ఎ.రామచంద్రరావు, డీపీవో కే.జగదీష్, డేటా మేనేజర్ వై జనార్ధన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే.రమేష్, సిహెచ్ఓ.బి.దేముడు, సూపెర్వైజర్ మామిడి రామకృష్ణ, పిహెచ్ఎన్ కన్నబీ, ఎంఎల్‌హెచ్‌పిలు ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

విఆర్ఎ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని వంగలి గ్రామ రెవిన్యూ సహాయకుడుగా పని చేస్తున్న ఎస్.కనకరావు ఇటీవల గుండెపోటు రావడంతో స్థానిక తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవిన్యూ సిబ్బంది తక్షణ సహాయం కింద 35వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసినట్లు మండల విఆర్ఏల సంఘ అధ్యక్షులు నీటిపల్లి గంగాధర్ తెలిపారు. కనకరావుకు అపోలో హాస్పటల్ లో గుండె ఆపరేషన్ చేయడంతో ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జెడ్సీకి మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఆగస్టు 2 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ అనకాపల్లి జోన్ మున్సిపల్ కమిషనర్ చక్రవర్తికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఔట్ సోర్సింగ్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు, ఆఫీసు సిబ్బందికి, పార్కు కూలీలకు వేతనాలు పెంచాలని, పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పుల్ సతీష్ కుమార్, సింగపల్లి అజయ్ కుమార్, ఎర్రంశెట్టి అప్పలరాజు, బంగారి శంకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు తరచూ పర్యవేక్షణలో ఉండాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులు సభలో వివరించారు. బి.కింతాడ సర్పంచ్ బూరె బాబూరావు మాట్లాడుతూ తమ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల స్థలం 9 సెంట్లు కబ్జాకు గురైందని గత సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఇప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. ఏ కొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. వాలాబు పంచాయతీలో తరచూ విద్యుత్ పోతుందని, ఆ సమస్యని పరిష్కారం చేయాలని సర్పంచ్ పోడెల లక్ష్మి కోరారు. వైస్ ఎంపిపిలు పంచాద సింహాచలం నాయుడు, ఒగ్గాకుల గంగభవాని, ఎంపిడివో సువర్ణ రాజు, తహశీల్దార్ లక్ష్మీదేవి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు

కల్తీ మద్యం దందాపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ప్రాంతంలో కల్తీ మద్యం తయారీ కేసులో అసలైన దోషులపై ఇప్పటికీ సమగ్ర విచారణ జరగకపోవడం తీవ్రంగా ఆందోళన కలిగిస్తున్నదని బీసీ సంఘం ఉపాధ్యక్షులు కుంద్రపు కృష్ణం నాయుడు పేర్కొన్నారు. స్పిరిట్‌తో మద్యం తయారు చేసి బెల్ట్ షాపులకు విక్రయిస్తున్న అక్రమ ముఠాను పోలీసులు అరెస్ట్ చేసినప్పటికీ, దందాపై అధికారులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. కల్తీ మద్యం వల్ల చాలామంది మృతి చెందుతున్నారని, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం కేసులో నిజమైన దోషులపై కఠిన చర్యలు తీసుకొని శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ముఖ్యమంత్రికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభిస్తామని హెచ్చరించారు.

డైట్‌లో పాలిటెక్నిక్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : డైట్ కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డిప్లొమా ఓరియెంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రమశిక్షణ, మంచి అలవాట్లు అవసరమని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ ఇన్‌ఛార్జ్ ఎన్. సరిత రాణి పాలిటెక్నిక్ కోర్సు ఆవశ్యకతను తెలియజేస్తూ విద్యార్థులకు మూడు సంవత్సరాలలో జరగబోవు విధి విధానాల గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ జె. గణేష్ ప్రసాద్‌రెడ్డి, డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వైకుంఠ రావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

లాలం భాస్కరరావు ద్వితీయ వర్ధంతి

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని లాలం కోడూరులో సోమవారం టిడిపి సీనియర్ నాయకులు లాలం భాస్కరరావు ద్వితీయ వర్ధంతి సభ సోమవారం జరిగింది. ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేష్‌బాబు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, టిడిపి కూటమి నాయకులు పాల్గొని భాస్కరరావుకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మెయిన్ రోడ్‌లో హైస్కూల్ నుండి పాత బస్టాండ్ వరకు డ్రైనేజీ మురుగునీరు రోడ్డుమీద ప్రవేశిస్తుండటంతో స్థానిక పంచాయతీ అధికారులు డ్రైనేజీ నిర్మాణం కోసం సోమవారం స్థలం పరిశీలించారు. దీని నిర్మాణానికి సుమారు 6 లక్ష రూపాయలు ఖర్చు చేయనున్నామని పంచాయతీ ఇఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులతో పాటు పిల గణేష్, సాయిరాం శ్రీను, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు మేరకే అంగన్వాడీ కార్యకర్త నియామకం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామ అంగన్వాడీ కార్యకర్త నియామకం నియమ నిబంధనలకు అనుసరించి నియమించినట్లు ఎలమంచిలి చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె ఇందిరా దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తగా నియమించబడిన ఈరిగిల భారతి పుట్టక నుంచి ఎస్సీ కులానికి చెందినవారని ఆమె తెలిపారు. ఆమె తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన బీసీ కులానికి చెందిన రాపేటి గౌతంను వివాహం చేసుకున్నంతమాత్రాన కులము మారిపోదని స్పష్టం చేశారు. ఆమె నియామకంలో రిజర్వేషన్ నిబంధనలో ఉల్లంఘించలేదన్నారు.

గొలుగొండ తహశీల్దారును సస్పెండ్ చేయాలి


కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బొడ్డడపాడు గిరిజనులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా గొలుగొండ మండల తహశీల్దారును తక్షణమే సస్పెండ్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాలయం ముందు ఆ మండలానికి చెందిన పాతమల్లం పేట పంచాయతీ రెవెన్యూ పరిధిలోని బొడ్డడపాడు గ్రామ గిరిజనులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ బొడ్డడపాడు గిరిజనులు తరతరాలు సాగు చేస్తున్న భూములను గిరిజనేతరులకు కట్టబెట్టేందుకు గొలుగొండ తహశీల్దార్ తప్పుడు పంచనామా రిపోర్టులను తయారు చేస్తున్నారని తెలిపారు. బొడ్డడపాడు గ్రామానికి 10కిలోమీటర్ల దూరంలో పంచాయితీ కేంద్రం పాత మల్లంపేటలో పంచనామా చేశారన్నారు. దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్‌తో విచారణ జరిపి ఈ తప్పుడు పంచనామా రిపోర్టులను రద్దు చేయాలని, తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సాగులో ఉన్న గిరిజన రైతుల పేరున ఎంజాయ్మెంట్ (సాగు) నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, బొడ్డడపాడు గిరిజన రైతులు సెగ్గే రాజుబాబు, టి.రాజుబాబు, ఎం.శివ, రమణమ్మ, పండియ్య, చినబాబు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

గురుకులంలో సీట్లు కేటాయించాలి

దేవరాపల్లి : మండలంలోని తెనుగుబూడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గిరిజన విద్యార్థులకు సీట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న సోమవారం పిజిఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పూర్తి స్థాయిలో విద్యార్థులు జాయిన్ కాకపోవడం వల్ల సీట్లు ఖాళీగా ఉండి పోతున్నాయని తెలిపారు. మాడుగుల నియోజక వర్గం పరిధిలోని గిరిజనుల పిల్లల కోసం ప్రత్యేకంగా గురుకుల పాఠశాలలు ఏమి లేవని, దీని వలన గిరిజన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సిలకు కేటాయించిన సీట్లు భర్తీ కాకపోతే గిరిజన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వీధిలైట్లు వేయాలని వినతి

పరవాడ : పరవాడ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జేఎన్ఎన్‌యుఎంఆర్ కాలనీలో వీధి లైట్లు వేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం సోమవారం కలెక్టరేట్ పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 520 ఇళ్లు ఉన్నప్పటికీ, రాత్రివేళ వీధుల్లో తగినంత వెలుగు లేకపోవడం వల్ల ప్రజలు భయంతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దీంతో రాత్రి సమయంలో చీకటి వాతావరణం, ఇంటి చుట్టూ పాములు, ఇతర సర్పాలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని తెలియజేశారు.

పిజిఆర్‌ఎస్‌కు 213 అర్జీలు

అనకాపల్లి : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్)కు ప్రజల నుండి 213 అర్జీలు అందాయి. కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, కెఆర్‌ఆర్‌సి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్ సుబ్బలక్ష్మి , జిల్లా గృహనిర్మాణ శాఖ పథక సంచాలకులు శ్రీనివాస్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిష్కారం కాని అర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా గ్రామీణాభివృద్ధి, డ్వామా పథక సంచాలకులు శచిదేవి, పూర్ణిమ దేవి, డిపిఒ ఈ.సందీప్, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.హైమావతి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కంపెనీల పేరుతో జరిపే సర్వేలను ఆపాలని వినతి

మునగపాక : కంపెనీల ఏర్పాటు పేరుతో గ్రామంలో చేపట్టే సర్వే పనులను ఆపాలని కోరుతూ మండలంలోని నారాయణపాలెం గ్రామ రైతులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కె వెంకట్ మాట్లాడుతూ కంపెనీలు ఏర్పాటు కోసం కొద్ది రోజులుగా తమ గ్రామంలో అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు భూములు సర్వే చేస్తున్నారని, దీనిపై స్థానికులు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమే జీవనాధారంగా బతుకుతున్న తమ గ్రామస్తులకు కంపెనీ పేరుతో భూములను లాక్కోవాలని చూస్తే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్. శ్రీనివాసరావు, కే రాజు, డి గోపాలకృష్ణ, ఎస్ నాగేశ్వరరావు, సిహెచ్ సంజీవరావు తదితరుల పాల్గొన్నారు.

పశువైద్యంలో అధికారుల నిర్లక్ష్యం


మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని పలు గ్రామాల్లో పశువులకు డి వార్మింగు, నట్టల నివారణ వంటి మందులు అందలేదన్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని, పశువులకు వైద్య సేవలు అందించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎపి గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంట శ్రీరామ్ అన్నారు. అనకాపల్లి మండలం ఊడేరు గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. తమ గ్రామంలో రెండు సంవత్సరాల నుండి పశుసంవర్ధక శాఖ నుండి ఎటువంటి నటలు నివారణ మందులు గాని, వ్యాక్సిన్ అందించలేదని శ్రీరామ్ దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. దీనిపై వెంటనే ఆయన జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రామ్మోహన్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా చాలామంది పశు వైద్యాధికారులు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న డి వార్మింగ్ ప్రోగ్రాం ద్వారా జీవాలకు ఇవ్వవలసిన మందులను ఇవ్వకుండా నిర్లక్ష్యంతో వ్యవహరించారని తెలిపారు. వీరిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యన జరిగిన డి వార్మింగ్ ప్రోగ్రాం (నట్ల నివారణ మందులు), వ్యాక్సిన్ కూడా ఈ గ్రామంలో ఇంతవరకూ జరగలేదన్నారు. సంబంధిత ఉన్నత అధికారులు వెంటనే స్పందించి ఈ గ్రామానికి పశు వైద్య సిబ్బందిని పంపించి వైద్యం అందించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఏదురి ఈశ్వరరావు, అప్పలనాయుడు, మెట్రి నాగ అప్పారావు, ఎదురి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా పైల శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పరవాడ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పైల శ్రీనివాసరావును పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, అనకాపల్లి పార్లమెంట్ సహాయ పరిశీలకుడిగా పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు శ్రీనివాసరావు సోమవారం వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌ని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు కోన రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, నాయకులు పైల అప్పలనాయుడు, బండారు శ్రీనివాస్, పైల హరీష్, వర్రి హరి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి మండలంలో వర్షం

ప్రజాశక్తి-దేవరాపల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా దేవరాపల్లి మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండడంతో జనజీవనం స్తంభించింది. ఈ వర్షం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజులుగా కాస్తున్న ఎండల వలన నారుమడులు ఎండిపోవడంతో రైతులు దిగాలుగా ఉన్న తరుణంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షం నారుమడులకు ఊపిరి పోసింది.

చలో విద్యుత్ సౌధను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని ఆగస్టు 7న చేపట్టే చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం జరిగిన యూనియన్ సమావేశంలో చలో విద్యుత్ సౌధా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్, అధ్యక్షులు డి.సూరిబాబు మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా అతి తక్కువ వేతనాలతో ట్రాన్స్కో, జెన్కో, డిస్కంలలో సంస్థలను నమ్ముకొని పర్మినెంట్ చేస్తారని 25 వేలమంది కాంట్రాక్ట్ కార్మికులు ఆశతో పనిచేస్తున్నారని తెలిపారు. షిఫ్ట్ ఆపరేటర్లుగా, వాచ్మెన్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, బిల్ కలెక్టర్, స్టోర్ హమాలీలు, మీటర్ రీడర్లుగా, ఎసిపిఎం, సిబిడి గ్యాంగ్మెన్లుగా, పోల్ టూ పోల్ వర్కర్లుగా రకరకాలుగా పనులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వీరికి పెరిగిన ధరలకు తుగుణంగా కనీస వేతనాలు ఇవ్వడంలేదని వాపోయారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురైతే పూర్తిగా కోలుకునే వరకు వైద్య సదుపాయం గాని, కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవటం గాని లేకపోవడం శోచనీయమన్నారు. డ్యూటీలో ఎలక్ట్రికల్ యాక్సిడెంట్లు జరిగితే చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ముఖ్యమంత్రికి, విద్యుత్‌శాఖ మంత్రికి, సిఎమ్‌డికి ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పరిష్కారం కాలేదన్నారు. విద్యుత్ కాంట్రాక్టర్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 2022 పిఆర్‌సి ఏరియర్స్ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.46000 చెల్లించాలని రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రేమ చంద్రశేఖర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు, చంద్రరావు కేదారేశ్వరరావు పాల్గొన్నారు.


చలో విద్యుత్ సౌధ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



వర్షంలో వ్యాపారాలు సాగిస్తున్న చిరు వ్యాపారులు

చినుకు పడితే..
చిరు వ్యాపారులకు అవస్థలే..

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగులలో ప్రతి సోమ, గురువారాల్లో జరిగే వారపు సంతలో చిరు వ్యాపారస్తులు వర్షం పడితే తీవ్ర అవస్థలు పడుతున్నారు. వ్యాపారం చేసే ప్రాంతం లో సరైన వసతి సౌకర్యాలు లేక పోవడంతో వర్షాకాలంలో సంత ప్రాంతం లో బురద నేలపై వ్యాపారాలు చేస్తూ, వర్షానికి తడిసి ముద్దవుతున్నారు. గ్రామ పంచాయతీ ఆశీలు రూపంలో చిరు వ్యాపారస్తుల నుండి ఆశీలు వసూలు చేస్తున్నా, వ్యాపారస్తులకు సరైన వసతి సౌకర్యాలు లేకపోవడం తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చిరు వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు వర్షాకాలంలో సామాన్లు తడవకుండా పరజాలు ఏర్పాటు చేసుకుని ఇబ్బందులు పడుతూ వ్యాపారం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం, అధికారులు స్పందించి సంత ప్రాంతంలో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని చిరు వ్యాపారస్తులు కోరుతున్నారు.



సత్కరిస్తున్న ఛైర్మన్, రైతు సంఘం అధ్యక్షులు

పిఎసిఎస్ ఛైర్మన్, డైరెక్టర్లకు సన్మానం

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలో ఏం.కోడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ గా నూతనంగా ఎన్నికైన పడాల చాణిక్య, డైరెక్టర్లు కురప బాలరాజు, పినబోయిన సత్యనారాయణ ను మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గొల్లవిల్లి రాజేష్ సోమవారం ఘనంగా సత్కరించారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి, జడ్పీ స్కూల్ ఛైర్మన్ గొల్లవిల్లి అప్పారావు, మాజీ స్కూల్ ఛైర్మన్లు ఎన్నేటి కొండలరావు, శనివాడ సత్యనారాయణ, పాతాళం ఆనంద్ పాల్గొన్నారు.

పిఎసిఎస్ ఛైర్మన్‌గా కృష్ణ

నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం పిఎసిఎస్ ఛైర్మన్గా కృష్ణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్లుగా ఎన్నికైన పొన్నాడ అప్పలకొండ , బైపిరెడ్డి నూకరాజు బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ బోర్డు మెంబర్లకు, ఛైర్మన్ కు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం పని చేయాలన్నారు.పిఎసిఎస్ ఛైర్మన్ రుత్తల కృష్ణ మాట్లాడుతూ, సంఘాల అభివృద్ధికి ముందుండి పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వైస్ ఛైర్మన్ చిట్టికల కన్నయ్య నాయుడు, రావణపల్లి రిజర్వాయర్ ఛైర్మన్ రుత్తల రాజేశ్వరరావు , గబ్బాడ సర్పంచ్ ఈర్లి రాజేశ్వరీ రాజబాబు పాల్గొన్నారు.



కృష్ణను సత్కరిస్తున్న రాజేష్

ఎన్నికల హామీలు గాలికి...

మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్

ప్రజాశక్తి- కోటవురట్ల: ఎన్నికల హామీలను గాలికి వదిలేసారని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విమర్శించారు. సోమవారం మాకవరపాలెం మండలంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడాది అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకానికి గండి కొట్టారని, నేటికీ ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి మహిళకు 1500 వంటి పథకాలు అమలు కాలేదన్నారు. బాబు అంటేనే మోసమన్నారు, నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తానని మోసం చేశారని ఎద్దేవా చేశారు. ఎంపీపీ సర్వేశ్వరరావు, పలువురు సర్పంచి, ఎంపీటీసీ సభ్యులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఉపాధి హామీ పనులపై విచారణ

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో రామ చంద్రపురం గ్రామంలో ఉపాధి పనుల్లో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం జిల్లా విజిలెన్స్ అధికారి రవీంద్రబాబు విచారణ చేపట్టారు. 2023-24 లో 2.30 లక్షల రూపాయల మస్తర్లు ఎనిమిది మంది పనులకు హాజరు కాకుండా దుర్వినియోగానికి పాల్పడ్డారని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. విచారణకు ఒకరు మాత్రమే హాజరు కావడంతో తదుపరి విచారణ చేపట్టే చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి మణికుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్, క్లస్టర్ ఈపిడి చెన్నారావు, ఈసీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న అధికారులు

ఆధార్‌లో తప్పులను సరి చేయాలి



మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి- నక్కపల్లి:అన్నదాత సుఖీభవ రైతులకు పెట్టుబడి నిమిత్తం ఎంతగానో ఉపయోగ పడుతుందని తహసిల్దార్ నరసింహామూర్తి అన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తో కలిసి వీఆర్వోలు, ఆర్ ఎస్ కె సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. మండలంలో 12421 మంది రైతులు సుఖీభవ పథకానికి లబ్ధిదారులే ఉన్నారని, వారిలో 1335 మంది రైతులు ఆధార్ సీడింగ్ తప్పుగా నమోదయిందని సరి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ, అర్హత కలిగిన కౌలు రైతులకు పత్రాలు అందించాలన్నారు. ఈ పంట నమోదు చేయాలని సూచించారు.

శ్మశాన వాటిక నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదు

ప్రజాశక్తి-గొలుగొండ:ఏళ్ల తరబడి దహన సంస్కారాలు జరుగుతున్న స్థలంలో శ్మశాన వాటిక నిర్మాణం చేపడుతుంటే వైసీపీ సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు అధికారులకు తప్పుడు ఫిర్యాదులు ఇస్తూ అడ్డుకోవడం తగదని టీడీపీ, జనసేన నాయకులు, మాజీ సర్పంచ్ కొలగాన రామారావు, బొప్పన ప్రసాదు, రేగుబల్ల శివ, సేనాపతి వరహాలు బాబు అన్నారు. సోమవారం గొలుగొండ మండలం సిహెచ్.నాగపురంలో నిర్మిస్తున్న శ్మశాన వాటిక వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ఏళ్ల తరబడి గ్రామంలో సమాధులు స్కూలుకు ఎదురుగా 20 మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని, పాఠశాలకు 150 మీటర్ల దూరంలో శ్మశాన వాటిక నిర్మిస్తుంటే కావాలనే రాజకీయ కక్షతో అడ్డుకోవడం తగదని హితవు పలికారు. శ్మశాన వాటికకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు 10 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేస్తే పంచాయతీ తీర్మానం సర్పంచ్ ఇవ్వకపోవడంతో గ్రామ సభ ఏర్పాటు చేసి గ్రామస్తులందరూ సంతకాలు చేసి అంగీకారం తెలిపారన్నారు. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులను రెచ్చగొట్టి తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ సేనాపతి సత్తిబాబు, యర్రా మురళి, పోలిశెట్టి జగ్గయ్య దొర, వెంకటేశ్వరరావు , అప్పన నాగేశ్వరరావు, దుంపలపూడి వెంకటరమణ, మంతెన సూర్యనారాయణ, కలం సత్యనారాయణ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



తీర్మానం చేస్తున్న నాయకులు

ఎంఇఓ 2గా నాగన్నదొర

ప్రజాశక్తి -నక్కపల్లి:మండల విద్యాశాఖాధికారి 2 గా రుత్తల నాగన్నదొర నియమితులయ్యారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎస్ రాయవరం మండలం గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బదిలీపై ఉద్దండపురం హైస్కూల్‌కు గెజిటెడ్ ప్రధానోపాధ్యా యులుగా బదిలీపై వచ్చారు. ఎంఈఓ నరేష్ తో కలిసి స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు.ఉపాధ్యాయులకు పలు సూచన చేశారు.



మాట్లాడుతున్న ఛైర్మన్

25న పెద్దేరు రిజర్వాయర్ నీరు విడుదల

- జలాశయ ఛైర్మన్ జగ్గారావు

ప్రజాశక్తి -మాడుగుల:ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పెద్దేరు జలాశయం నుండి నీటిని ఈ నెల 25వ తేదీన శుక్రవారం విడుదల చేయడం జరుగుతుందని జలాశయం ఛైర్మన్ అద్దేపల్లి జగ్గారావు పేర్కొన్నారు. సోమవారం జలాశయం సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్. రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు ఆదేశాల మేరకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెద్దేరు రిజర్వాయర్ ద్వారా ఈ నెల 25 నుండి నవంబర్ నెల వరకు నీటిని విడుదల చేస్తున్నట్లు జగ్గారావు తెలిపారు.ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దేరు రిజర్వాయర్ డిఈఈ చిన్నం నాయుడు, వైస్ ఛైర్మన్ ఆర్లి గోవిందరాజు, కింతలి కోపరేటివ్ అధ్యక్షులు నందారపు సన్యాసిరావు, తెలుగు యువత అధ్యక్షులు వడ్డి రాజకుమార్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఉద్యోగులు

సచివాలయం సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురం మేజర్ పంచాయతీలో గ్రామ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన, విధుల్లో చేరిన సచివాలయం సిబ్బందికి ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన గ్రామ సర్పంచ్ లోచల సుజాత సిబ్బంది సేవలను కొనియాడారు. ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్, కూటమి నాయకులు బొడ్డు జమీలు, వార్డు మెంబర్ అవినాష్ నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విఆర్ఒను సన్మానిస్తున్న అధికారులు

విఆర్ఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి -కోటవురట్ల: అజాతశత్రువు విఆర్ఓ అని తహసిల్దారు తిరుమల బాబు కొనియాడారు. లింగాపురం సచివాలయ గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.సతీష్‌ను సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు. ఇటీవల సచివాలయ బదిలీల్లో భాగంగా నర్సీపట్నం శారద నగర్ 2 కు బదిలీ అయ్యింది. దీంతో రెవెన్యూ గ్రామ అధికారులు సిబ్బంది సత్కరించి ఇతను చేసిన సేవలను కొనియాడారు. తహసిల్దార్ మాట్లాడుతూ లింగాపురం, జగ్గంపేట రెవెన్యూ గ్రామాలకు విఆర్వోగా పనిచేసే విశిష్ట సేవలు అందించడమే కాకుండా తోటి సిబ్బందికి కూడా తన వంతు సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, ఆర్ఐ మణికంఠ, వీఆర్వో సంఘ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయండి

-యాప్‌ల భారం మాకొద్దు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అంగన్‌వాడీల ధర్నాలు, వినతులు

ప్రజాశక్తి- అనకాపల్లి : అంగన్వాడీలకు ఎఫ్ ఆర్ ఎస్ యాప్ రద్దు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, 5జీ మొబైల్స్ ఇవ్వాలని డిమాండ్లపై సోమవారం అనకాపల్లి కొత్తూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగశేషు మాట్లాడుతూ స్థానిక ఐసిడిఎస్ పిఓ ద్వారా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ప్రతి ఒక్క దానికి ఒక్కో రకమైన యాప్ ఉపయోగించి ఓటీపీల ద్వారా సరుకులు అందించే నిబంధనలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పరమేశ్వరరావు, ప్రాజెక్ట్ నాయకులు ఎన్ వరలక్ష్మి(బుజ్జి), కృష్ణవేణి, రామలక్ష్మి, తులసి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కె.కోటపాడు : అంగన్వాడీ కార్యకర్తలు రకరకాల యాప్‌ల తో ఇబ్బందులకు గురవుతున్నారని, అన్ని కార్యకలాపాలను ఒకే యాప్ ద్వారా నిర్వహించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.భవాని, జి.కుమారి, వరలక్ష్మి, రమణమ్మ, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : ఐసిడిఎస్ ప్రాజెక్టు లైన్ కొత్తూరు కార్యాలయం వద్ద సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తులన ధర్నా నిర్విహించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, ప్రాజెక్టు లీడర్ శశికళ, సుజాత, జయ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.


సబ్బవరంలో...


యలమంచిలిలో...

సబ్బవరం : మండల కేంద్రంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్లు ఫేస్ యాప్ ఆన్ లైన్ విధానం రద్దు చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఆన్లైన్ విధానం పేస్ యాప్ వలన గ్రామీణ ప్రాంతాలలో సెల్ ఫోన్‌లకు సిగ్నల్ అందక యాప్ ఓపెన్ కాకపోవడం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.లలిత కుమారికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ల సంఘం అధ్యక్షులు వి.వి రమణమ్మ, కార్యదర్శి ఎం. రమణమ్మ,కోశాధికారి బి. రమణమ్మ సుమారు వందమంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, యాప్‌ల భారం నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఎంవిపి.కాలనీలోని పీడీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం ఉపాధ్యక్షురాలు కె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఫీల్డ్ రిపోర్టింగ్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని దుయ్యపట్టారు. పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌ల వల్ల అంగన్‌వాడీలు తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి.మణి, ప్రధాన కార్యదర్శి దేవి, నాయకులు పద్మ, శ్రీదేవి, శోభ, ఈశ్వరమ్మ, తులసి, చిన్నమ్ములు, సూర్య కళ, నర్సయ్యమ్మ, బేగం తదితరులు పాల్గొన్నారు. నోడల్ ఆఫీసర్ ఝాన్సీకి వినతిపత్రం సమర్పించారు.

నక్కపల్లి: యాప్ ల భారం నుండి విముక్తి చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు ఆందోళన బాట పట్టారు. నక్కపల్లి లో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. సరుకులు ఇచ్చేటప్పుడు అంగన్వాడి వర్కర్ ఫోటోతో పాటు, లబ్దిదారులకు ఫోటోలు తీసి యాప్ లో నమోదు చేసి ఇవ్వాలని అధికారులు ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు దుర్గారాణి మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని, బడ్జెట్ పెంచి ప్రీ స్కూల్స్ ను బలోపేతం చేయాలని, ఎఫ్ ఆర్ ఎస్ యాప్ రద్దు చేసి, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.


రావికమతంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

రావికమతం: అంగన్వాడీల సమస్యలను తక్షణమే పురస్కరించాలని మండల కేంద్రం ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద సోమవారం అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు పి.వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఎస్. కృష్ణ వేణి మాట్లాడుతూ,ఫేస్ యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి వజ్రపు సత్యవతి డిమాండ్ చేశారు.. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐసిడిఎస్ అధికారులకు అందజేశారు.

మాడుగుల: అంగన్వాడీల సమస్యలపై ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సిడిపిఓ శశికళకి వినతిపత్రం ఇచ్చారు. యాప్‌లతో లబ్ధిదారులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని, రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 5జి నెట్వర్క్ తో మొబైల్స్‌ని అందించాలని డిమాండ్ చేశారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్ట్ నాయకులు జానకి రామలక్ష్మి, పాల్గొన్నారు.


నక్కపల్లిలో...

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-రావికమతం: అనారోగ్యంతో బాధపడు తున్న పలువురి బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక చోడవరం శాసన సభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు, రావికమతం మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోన్నవోలు గ్రామానికి చెందిన ముచ్చకర్ల వరహాలమ్మకు, గర్నికం గ్రామానికి చెందిన ఆర్లే చిన్న నూకరాజు, మరుపాక గ్రామానికి చెందిన వెలుపూరి సత్యలక్ష్మి, తట్టబంద గ్రామానికి చెందిన నమ్మి అప్పారావులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ, రావికమతం మండలంలో ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు, మరుపాక ఎంపీటీసీ సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ రాంబాబు, తట్టబంధ సర్పంచ్ గోకివాడ రమణ, ఎంపీటీసీ శేషుబాబు పాల్గొన్నారు.


చెక్కును ఇస్తున్న ఎమ్మెల్యే రాజు

తాండవ నీటిని విడుదల చేస్తాం

ప్రజాశక్తి-నాతవరం: తాండవ ఆయకట్టు నుంచి రైతుల అభీష్టం మేరకే ఖరీఫ్‌కు నీటిని విడుదల చేస్తామని తాండవ డిఈ అనురాధ చెప్పారు. సోమవారం నాతవరం జనవరుల శాఖ సెక్షన్ కార్యాలయంలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఆగస్టు 7వ తేదీ నుంచి 15వ తేదీ లోపు నీటిని విడుదల చేయాలని రైతుల కోరారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్‌కు నీటి విడుదల సమయంలో తాండవ జలాశయానికి జల హారతి కార్యక్రమం కూడా చేపట్టనున్నామని తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయుకట్టు రైతులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాతవరం పిఎసిఎస్ అధ్యక్షులు అప్పిరెడ్డి మాణిక్యం, శృంగ వరం పిఎసిఎస్ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసి దేముడు, పీకే గూడెం పిఎసిఎస్ అధ్యక్షులు నాని బాబు, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, మాజీ తాండవ చైర్మన్ పారుపల్లి కొండబాబు, జడ్పిటిసి అప్పలనర్స, మాజీ ఎంపీపీ నేతల విజయ్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఇ


నారు మడులను పరిశీలిస్తున్న ఎఒ

జీవన ఎరువులను వినియోగించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి: రైతులు జీవన ఎరువులు వాడుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. మండలంలో దేవవరం, గొడిచర్ల గ్రామాల్లో క్షేత్ర పర్యటనలో భాగంగా వరి నారుమళ్లను పరిశీలించారు. జీవన ఎరువులు వినియోగిస్తే 10 శాతం ఎరువులు ఆదా చేయవచ్చునని రైతులకు తెలియజేశారు. జీవన ఎరువులతో పంటకు బలం చేకూరుతుందన్నారు. జీవన ఎరువులలో నత్రజని ఎరువులు రైజోబియం, అజటోబాక్టర్ మొక్కకు ఉపయోగప డుతుందన్నారు. రైతులకు జీవన ఎరువులు అందజేశారు. ఏఈఓ సత్యనారాయణ, ఏఈఓ శ్రీనివాసు, రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రశాంతి పాల్గొన్నారు.

డ్రెయినేజీ పరిశీలన

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో గొంప గ్రామంలో పలు వీధుల్లో డిప్యూటీ ఎంపీడీవో స్వామి సోమవారం సందర్శించారు. గ్రామ పురవీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపైనే నీరు నిలిచిపోయిన పరిస్థితిని ఆయన గుర్తించారు. గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సచివాలయం నుంచి విశాఖ డైరీ మిల్క్ సెంటర్ వరకు డ్రైనేజీ పైన పేరుకుపోయిన మట్టిని జెసిబి సహాయంతో ట్రాక్టర్ లోనికి తరలించి డ్రైనేజీకి ఇరువైపులా మట్టి ,చెత్త, చెదారం లేకుండా చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ స్వామి,సర్పంచ్ గోవింద,సెక్రెటరీ విజయ, వైస్ ప్రెసిడెంట్ రాజు,యూనిట్ ఇంచార్జీ హరికృష్ణ పాల్గొన్నారు.


మురుగునీటిని పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్, ఫోన్లు అందజేత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జెసి కె.మయూర్అశోక్ చేతుల మీదుగా విభిన్నప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఐదుగురు విభిన్నప్రతిభావంతులకు నాలుగు టచ్ మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్ ట్యాప్ అందజేశారు. వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. డిఆర్ఓ భవానీశంకర్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి కవిత,ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లో చేర్చుకోవాలని కోరుతూ, విశాఖ ఉక్కు నిర్వాసితుల ఐక్య సంఘం, విశాఖ ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.